

# నిత్యకు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పంచకుల(హర్యానా) వేదికగా జరుగుతున్న 63వ జాతీయ ఇంటర్‌స్టేట్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ అథ్లెట్ నిత్య గాదె కాంస్య పతకంతో మెరిసింది. శుక్రవారం జరిగిన మహిళల 100మీటర్ల రేసును నిత్య 11.79సెకన్లలో ముగించి మూడో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడ్డ స్నేహ(11.62సె), గిరిధరణి(11.77సె) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు.

# నాగల్ తొలి పోరు మియోమిర్‌తో

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ టెన్నిస్ టోర్నీ మెయిన్ డ్రాకు అర్హత సాధించిన భారత యువ సంచలనం సుమిత్ నాగల్ తొలి రౌండ్‌లో సెర్బియా టెన్నిస్ ప్లేయర్ మియోమిర్ కెస్‌మానోవిచ్‌తో తలపడనున్నాడు. సోమవారం(జూలై 1) నుంచి లండన్ వేదికగా ఈ మెగా టోర్నీ మొదలుకానుంది. తొలి రౌండ్ విఘ్నాన్ని దాటితే మూడో రౌండ్‌లో అతడు వరల్డ్ నంబర్‌వన్ జన్నిక్ సిన్నర్(ఇటలీ)తో తలపడే అవకాశాలున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ అల్కారజ్, సిన్నర్, జొకోవిచ్‌కు సులువైన డ్రా దక్కగా ఇటీవలే ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ గెలిచిన ఇగా స్వియాటెక్ మొదటి రౌండ్లోనే బలమైన ప్రత్యర్థి సోఫియా కెనిన్(అమెరికా)తో ఆడనుంది.



## క్వార్టర్స్‌కు భారత షట్లర్లు

టెక్సాస్: యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ల జోరు కొనసాగుతోంది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఎనిమిదో సీడ్ ప్రియాన్షు రజావత్ 21-18, 21-16తో హువాంగ్ యు కి (చైనీస్ తైపీ) పై నెగ్గాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో మాళవిక బన్సోద్ 15-21, 21-19, 21-14తో తెరెజా స్వాబికోవా(చెక్ రిపబ్లిక్)పై పోరాడి గెలిచింది. మహిళల డబుల్స్‌లో భారత ద్వయం త్రిసా జాలీ-గాయత్రి గోపీచంద్ 16-21, 21-11, 21-19తో సె పీ షాన్-హుంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ)ని ఓడించి క్వార్టర్స్‌కు అర్హత సాధించింది.



మంధాన 149

# ఒక్క రోజే 525

**చెన్నై టెస్టులో భారత్ రికార్డు స్కోరు • షఫాలీ వర్మ డబుల్ ధమాకా • స్మృతి మంధాన శతకం • భారత్, దక్షిణాఫ్రికా ఏకైక టెస్టు**

చెన్నై: భారత మహిళల క్రికెట్‌లో 'లేడీ సెహ్వాగ్' అన్న గుర్తింపు దక్కించుకున్న యువ ఓపెనర్ షఫాలీ వర్మ (197 బంతుల్లో 205, 23 ఫోర్లు, 8 సిక్సర్లు) అందుకు తగ్గట్టుగానే టెస్టులలో రికార్డు ద్విశతకంతో మెరిసింది. చెన్నై వేదికగా దక్షిణాఫ్రికాతో శుక్రవారం నుంచి మొదలైన ఏకైక టెస్టు తొలి రోజే బౌండరీలు, సిక్సర్ల మోత మోగించి టెస్టులలో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీని నమోదు చేసింది. కెరీర్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న స్మృతి మంధాన (161 బంతుల్లో 149, 27 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి రికార్డు భాగస్వామ్యం (292) నెలకొల్పడంతో తొలి రోజు భారత్ 98 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 525 పరుగుల భారీ స్కోరు సాధించి తొలిరోజే తిరుగులేని స్థానంలో నిలిచింది.

**టెస్టులలో ఇదే అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ. అన్నాబెల్ (ఆసీస్ 248 బంతుల్లో) రికార్డును షఫాలీ బ్రేక్ చేసింది.**

**ఆరంభం నుంచే దూకుడు:**

కెరీర్‌లో ఐదో టెస్టు ఆడుతున్న షఫాలీ, సీనియర్ బ్యాటర్ స్మృతి ఆది నుంచే సఫారీ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఏడో ఓవర్లో బౌండరీతో షఫాలీ బౌండరీల మోతకు శ్రీకారం చుట్టింది. డీక్లర్క్ 9వ ఓవర్లో రెండు ఫోర్లతో మంధాన కూడా అదే బాటలోకి వచ్చింది. తొలి సెషన్‌లోనే ఈ ఇద్దరూ అర్ధ సెంచరీలు పూర్తిచేసి క్రీజులో నిలదొక్కుకున్నారు. 38 ఓవర్ ఆఖరి బంతికి షఫాలీ 113 బంతుల్లోనే షఫాలీ తన టెస్టు కెరీర్‌లో తొలి శతకాన్ని పూర్తి చేయగా మరుసటి ఓవర్ తొలిబంతికి మంధాన మూడంకెల స్కోరు చేసింది. గడిచిన ఐదు అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆమెకు ఇది నాలుగో సెంచరీ.

**షఫాలీ డబుల్:**

శతకాల తర్వాత ఈ జోడీ పోటీపడి బౌండరీలు బాదారు. ఓవర్‌కు ఒక్క ఫోర్‌కు తగ్గకుండా వీరి జోరు సాగింది. డెర్క్‌సెన్ 49వ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు బాదిన మంధానను టక్కర్ 52వ ఓవర్లో ఔట్ చేయడంతో రికార్డు భాగస్వామ్యానికి తెరపడింది. రెండో సెషన్‌లో షఫాలీ, మంధాన దూకుడుతో 32 ఓవర్లలోనే భారత్ 204 పరుగులు పిండుకోవడం విశేషం. మంధాన నిష్క్రమించినా జెమీమా రోడ్రిగ్స్ (55)తో కలిసి షఫాలీ జోరు కొనసాగించింది. 180లలోకి వచ్చాక టక్కర్ వేసిన 73వ ఓవర్లో 2 సిక్సర్లు బాదింది. మూడో బంతికి సింగిల్ తీసి ద్విశతకాన్ని పూర్తిచేసింది. ఈ క్రమంలో మిథాలీరాజ్ తర్వాత డబుల్ సెంచరీ చేసిన రెండో భారత బ్యాటర్‌గా షఫాలీ నిలిచింది. ఆఖర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (42 నాటౌట్), రిచా(43 నాటౌట్) దూకుడుగా ఆడటంతో భారత్ భారీ స్కోరు దిశగా సాగుతోంది.

**సంక్షిప్త స్కోర్లు:**
**భారత్:** 98 ఓవర్లలో 525/4 (షఫాలీ 205, మంధాన 149, టక్కర్ 2/141, డీ క్లర్క్ 1/60)

**1**

**షఫాలీ-స్మృతి నమోదుచేసిన భాగస్వామ్యం (292) టెస్టులలో అత్యధిక ఓపెనింగ్ పార్ట్‌నర్‌షిప్. గతంలో ఈ రికార్డు పాక్ బ్యాటర్లు సాజిదా-కిరణ్ (వెస్టిండీస్‌పై 241) పేరిట ఉండేది. భారత్ తరఫున ఇదే అత్యధికం కాగా ప్రపంచ క్రికెట్‌లో ఏ వికెట్‌కు అయినా ఇది రెండో అత్యుత్తమం.**

### రికార్డు స్కోరు

మహిళల టెస్టు క్రికెట్ చరిత్రలో ఒక రోజు అత్యధిక పరుగులు చేసిన జట్టుగా భారత్ రికార్డులకెక్కింది. 1935లో ఇంగ్లండ్ (కివీస్‌పై 431/2) ఈ ఘనత నమోదుచేసింది. ఇదే రోజు న్యూజిలాండ్ సైతం 44 రన్స్ చేసింది. అయినా ఇరుజట్లు కలిసిచేసింది (475) భారత్ కంటే తక్కువే. పురుషుల క్రికెట్‌లో సైతం ఒకరోజు అత్యధిక పరుగులు చేసిన జాబితాలో శ్రీలంక పేరిట ఉన్న (బంగ్లాదేశ్‌పై 509) రికార్డు కనుమరుగైంది.

### నాడు వీరూ.. నేడు షఫాలీ..

2008 మార్చి 28, భారత్- దక్షిణాఫ్రికా మధ్య ఇదే చెన్నై వేదికగా జరిగిన టెస్టులో వీరేంద్ర సెహ్వాగ్ 194 బంతుల్లోనే ట్రిపుల్ సెంచరీ (319) చేశాడు. వ్యక్తిగత స్కోరు 190లలోకి వచ్చాక సిక్సర్ బాదాడు. భారత్‌కు పురుషుల విభాగంలో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ రికార్డు ఇప్పటికే అతడిదే. 2024, జూన్ 28న షఫాలీ సైతం ఇవే ఘనతలు నమోదు చేయడం విశేషం.



షఫాలీ (205)

నేడు భారత్, దక్షిణాఫ్రికా టీ20 ప్రపంచకప్ ఫైనల్

# బిగ్ ఫైట్

**జోరు మీదున్న ఇరు జట్లు**

**మ్యాచ్‌కు వరుణుడు అంతరాయం!**

**ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ ఆఖరి అంకానికి చేరుకుంది. అపజయమన్నదే ఎరుగకుండా ప్రత్యర్థులను చిత్తుచేస్తూ అజేయంగా ఫైనల్లోకి దూసుకొచ్చిన భారత్, దక్షిణాఫ్రికా తమ చిరకాల కల సాకారానికై సై అంటే సై అంటున్నాయి. గత 17 ఏండ్లుగా టీ20 ప్రపంచకప్ ట్రోఫీ కోసం టీమ్‌ఇండియా ఎదురుచూస్తుంటే.. తొలి సారి ఫైనల్ పోరుకు అర్హత సాధించిన సఫారీలు సత్తాచాటేందుకు తహతహలాడుతున్నారు. వరుణుడు అంతరాయం కల్గించే అవకాశమున్న నేపథ్యంలో మ్యాచ్ సజావుగా సాగేది సందిగ్ధంగా మారింది.**



బ్రిడ్జ్‌టౌన్(బార్బడోస్): టీ20 ప్రపంచకప్‌లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఆఖరి సమరానికి సమయం ఆసన్నమైంది. మరికొన్ని గంటల్లో బార్బడోస్ వేదికగా రెండు జట్లు కదనరంగంలోకి దూకనున్నాయి. అఫ్గానిస్థాన్‌ను చిత్తుచేస్తూ సఫారీలు ఫైనల్లో అడుగుపెట్టగా..గత టోర్నీలో తమకు ఎదురైన పరాజయానికి ఇంగ్లండ్‌పై ప్రతీకారం తీర్చుకుంటూ టీమ్‌ఇండియా తుది పోరులో నిలిచింది. సరిగ్గా పదేండ్ల తర్వాత పొట్టి ప్రపంచకప్‌లో టైటిల్ పోరుకు అర్హత సాధించిన భారత్..రెండో సారి కప్‌ను ముద్దాడాలని చూస్తున్నది. ఐసీసీ మెగాటోర్నీల్లో తమపై ఉన్న చోకర్స్ ముద్రను చెరిపివేస్తూ తొలిసారి ఫైనల్‌కు వచ్చిన సఫారీలు ప్రపంచకప్‌ను ఒడిసిపట్టుకునేందుకు తహతహలాడుతున్నారు. ఈ నేపథ్యంలో కప్ కోసం రెండు అత్యుత్తమ జట్లు కొదమ సింహాల్లా కొట్లాడే అవకాశముంది. బలబలాల పరంగా చూస్తే..దక్షిణాఫ్రికా కంటే భారత్ బలంగా కనిపిస్తున్నా..అనిశ్చితికి మారుపేరైనా టీ20ల్లో అదృష్టం ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరం.

**ఆఖరాటలో మెరిసేనా!**

తమ కెరీర్‌లో చివరి టీ20 ప్రపంచకప్ ఆడుతున్న రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ, రవీంద్ర జడేజా ఆఖరాటలో ఆకట్టుకునేందుకు పట్టుదలతో ఉన్నారు. ముఖ్యంగా ఫామ్‌లేమితో సతమతమవుతున్న కోహ్లీకి ఓపెనింగ్ కలిసిరావడం లేదు. ప్రస్తుత టోర్నీలో స్థాయికి తగ్గ ఆటతీరు ప్రదర్శించలేకపోయిన కోహ్లీ..ఫైనల్లో బ్యాటు ఝులిపించేందుకు కసిమీద ఉన్నాడు. మరోవైపు మంచి ఫామ్‌మీదున్న కెప్టెన్ రోహిత్..ప్రత్యర్థి బౌలర్లపై ఆకలిగొన్న పులిలా విరుచుకుపడుతున్నాడు. ఒక ఎండ్‌లో కోహ్లీ విఫలమవుతున్నా..ఆ ప్రభావం కనిపించకుండా బ్యాటింగ్ భారాన్ని మోస్తున్నాడు. ఆల్‌రౌండ్ కోటాలో తుది జట్టులో కొనసాగుతున్న జడేజా తన పాత్రకు న్యాయం చేయలేకపోతున్నాడు. అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో మెరుపులు మెరిపించలేకపోతున్నాడు. ఇదిలా ఉంటే ప్రధాన కోచ్‌గా ద్రవిడ్‌కు ఇదే చివరి మ్యాచ్. ఇంగ్లండ్‌తో సమిష్టి ప్రదర్శన కనబరిచిన టీమ్‌ఇండియా..అదే రీతిలో సఫారీల భరతం పట్టేందుకు పక్కా ప్రణాళికతో ఉంది. పిచ్‌పై పూర్తి అవగాహనకు వచ్చిన టీమ్ మేనేజ్‌మెంట్ స్పిన్నర్లతో సానుకూల ఫలితాలను రాబడుతున్నది. ఇంగ్లండ్‌తో సెమీస్ పోరులో అక్షర్‌పటేల్, కుల్దీప్‌యాదవ్ ప్రదర్శనే ఇందుకు నిదర్శనం. వీరికి తోడు బుమ్రా, అర్ష్‌దీప్‌సింగ్ వికెట్ల వేట కొనసాగిస్తున్నారు.

**సఫారీలు సత్తాచాటేనా?**

మెగాటోర్నీలో తొలిసారి ఫైనల్ ఆడబోతున్న సఫారీలు..భారత్‌కు దీటైన పోటీనిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. క్వింటన్ డికాక్, క్లాసెన్, కెప్టెన్ మార్క్‌రమ్, స్టబ్స్ పరిస్థితులకు తగ్గట్లు ఆడుతూ విజయాల్లో కీలకమవుతున్నారు. ఓపెనర్ డికాక్ నిలకడలేమి ఆందోళన కల్గిస్తున్నా..తనదైన రోజు అతడు సాగించే విధ్వంసం మాటలకందనిది. మిడిలార్డర్‌లో మార్క్‌రమ్, క్లాసెన్, మిల్లర్, స్టబ్స్ చెలరేగితే భారత్‌కు కష్టాలు తప్పకపోవచ్చు. రబాడ, జాన్సెన్, నోకియా, మహారాజ్, షంసీతో సఫారీలు బలంగా కనిపిస్తున్నారు. భారత బ్యాటర్లను వీరు ఏ మాత్రం నిలువరిస్తారో చూడాలి.

### జట్ల అంచనా

**భారత్:** రోహిత్(కెప్టెన్), కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, హార్దిక్, అక్షర్, జడేజా, అర్ష్‌దీప్, కుల్దీప్, బుమ్రా.
**దక్షిణాఫ్రికా:** మార్క్‌రమ్(కెప్టెన్), డికాక్, హెండ్రిక్స్, మిల్లర్, స్టబ్స్, క్లాసెన్, జాన్సెన్, మహారాజ్, రబాడ, నోకియా, షంసి/బార్ట్‌మన్.

**2**

**2007లో తొలిసారి ప్రపంచకప్ గెలిచిన భారత్‌కు ఈసారి గెలిస్తే.. మన ఖాతాలో రెండోది చేరినట్లే.**

### పిచ్, వాతావరణం:

ఫైనల్‌కు వేదికైన కెన్సింగ్టన్ ఓవల్..పేసర్లకు అనుకూలించనుంది. వర్షం అంతరాయం కల్గించే అవకాశముంది. వర్షంతో మ్యాచ్‌కు ఆటంకం ఏర్పడితే రిజర్వ్‌డే(ఆదివారం) కొనసాగించవచ్చు. కనీసం 10 ఓవర్ల మ్యాచ్ ద్వారా విజేతను ప్రకటించనున్నారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.